నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 3 జనవరి 2024 | KAMAREDDY

చందూర్‌లోని మీసేవ సెంటర్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన దివ్యాంగులు

సదరం స్లాట్లు.. దివ్యాంగుల పాట్లు

చందూర్, జనవరి 2 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గత రెండు నెలలుగా సదరం క్యాంపులు నిర్వహించలేదు. దీంతో చాలా మంది దివ్యాంగులు శిబిరాల కోసం ఎదురు చూశారు. వైకల్య నిర్ధారణ కోసం స్లాట్లు బుక్ చేసుకునేందుకు మంగళవారం అవకాశం ఉండగా వందల సంఖ్యలో బాధితులు మీ సేవ కేంద్రాల వద్ద క్యూ కట్టారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన స్లాట్లు క్షణాల వ్యవధిలో బుక్ అయ్యాయి. మొత్తం 390 స్లాట్లు ఇవ్వగా, జిల్లావ్యాప్తంగా 200కు పైగా మీ సేవ కేంద్రాల్లో ఒక్కొక్కరికే స్లాట్ దక్కింది. వేకువ జాము నుంచి పడిగాపులు కాసిన దివ్యాంగులంతా ఊసురుమంటూ వెనుదిరిగారు.

అలర్ట్

నేడు, రేపు మిషన్ భగీరథ తాగునీరు నిలిపివేత

బాన్సువాడ, జనవరి 2: సింగూర్, జుక్కల్ సెగ్మెంట్ పరిధిలోని మిషన్ భగీరథ 145 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ప్రధాన పైపులైన్‌లో లీకేజీల మరమ్మతు నిర్వహణ కోసం బుధ, గురువారాల్లో మిషన్ భగీరథ పథకంలో వచ్చే తాగునీటిని నిలిపివేస్తున్నట్లు డీఈ వెంకటేశ్వర్లు గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాన్సువాడ, బోధన్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని ఎల్లారెడ్డి, లింగంపేట్, నాగిరెడ్డిపేట్ మండలాలతోపాటు జుక్కల్ నియోజకవర్గంలోని గ్రామాలకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. గ్రామాల్లోని బోర్‌వెల్స్‌ను వాడుకోవాలని, ప్రజలు సహకరించాలని కోరారు.

అన్ని రకాల దరఖాస్తులను స్వీకరించాలి

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



ఆర్మూర్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

నిజామాబాద్ స్పోర్ట్స్/ఆర్మూర్‌టౌన్/నందిపేట్, జనవరి 2: ప్రజాపాలన సభల్లో ప్రజలు అందించే అన్నిరకాల దరఖాస్తులను స్వీకరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోని ఖుద్వాన్‌పూర్, వన్నెల్(కే), మచ్చర్ల, ఆర్మూర్ పట్టణంలోని 14వ వార్డులో కొనసాగుతున్న ప్రజాపాలన సభలను మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కౌంటర్ల ఏర్పాటు, అందుబాటులో ఉన్న దరఖాస్తు ఫారాలు, వలంటీర్లు, సిబ్బందితోపాటు ప్రజలకు కల్పించిన మౌలిక వసతులను పరిశీలించారు. ఇప్పటివరకు స్వీకరించిన దరఖాస్తులు, ప్రజలు ఏ పథకం కోసం అధికంగా దరఖాస్తు చేసుకున్నారనే వివరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులో పొందుపర్చిన పథకాలతోపాటు ఇతర అంశాలపై కూడా ప్రజలు సమర్పించే అర్జీలను తప్పనిసరిగా స్వీకరించాలని ఆదేశించారు. రేషన్‌కార్డులు, రెవెన్యూ సంబంధిత అంశాలు, సీసీ రోడ్ల నిర్మాణాలు తదితర ఏ విషయంలోనైనా అధికారులకు వినతిపత్రాలను అందించవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. అయితే, ఐదు గ్యారెంటీలు కాకుండా ఇతర అంశాలపై వచ్చే దరఖాస్తుల వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తుకూ తప్పనిసరిగా రసీదు అందించాలన్నారు. దరఖాస్తులు అందించేందుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నారు. ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కలెక్టర్ వెంట ఆర్డీవో వినోద్‌కుమార్, నోడల్ అధికారి జగన్నాథాచారి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో కలెక్టర్ జితేశ్.. రామారెడ్డి, మాచారెడ్డి మండలంలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. మాచారెడ్డి మండలం బండ రామేశ్వర్‌పల్లి, అక్కాపూర్‌లో గ్రామసభలను పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

రేపే అవిశ్వాస పరీక్ష

ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లు

ఆర్మూర్ టౌన్, జనవరి 2: ఆర్మూర్ బల్దియా రాజకీయం రసవత్తరంగా సాగుతున్నది. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతాపై ఇటీవల పలువురు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం చేస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దీంతో అవిశ్వాస పరీక్షను ఈ నెల 4న చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించడంతో ఆ దిశగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. నాలుగేండ్ల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా గెలిచిన పండిత్ వినీతను మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చొరవతో చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. ఆర్మూర్ పట్టణ రాజకీయాల్లో మాజీ ఎమ్మెల్యే, ఆయన సోదరుడు రాజేశ్వర్‌రెడ్డి చైర్‌పర్సన్ పండిత్ వినీత, భర్త పవన్, మరిది పండిత్ ప్రేమ్‌కు అధిక ప్రాధాన్యమిచ్చారు. కానీ పదవిని దుర్వినియోగం చేస్తూ అనేక అవినీతి అక్రమాలు చేశారని చాలా సార్లు ప్రతిపక్ష పార్టీలు ఫిర్యాదు చేశాయి. సొంత పార్టీ కౌన్సిలర్లు సైతం వీరి ఆగడాలపై మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి వివరించారు. ఒక దశలో చైర్‌పర్సన్‌ను మార్చాల్సిందేనని పట్టుబట్టారు. కానీ మాజీ ఎమ్మెల్యే వారిని సముదాయిస్తూ వచ్చారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త, మరిది బీజేపీకి లోపాయికారిగా పనిచేశారని బీఆర్ఎస్ కౌన్సిలర్లు కొందరు ఆరోపిస్తున్నారు. ఎన్నికల తర్వాత చైర్‌పర్సన్ భర్త బీజేపీలో చేరేందుకు ప్రయత్నించగా ఆ పార్టీ నాయకులు వ్యతిరేకించినట్లు తెలిసింది. ఇటీవల మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటి వద్ద కాంగ్రెస్ ముఖ్య నాయకులతో సమావేశమై కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు చర్చలు జరపగా, పట్టణ కాంగ్రెస్ నాయకులు సైతం వారి చేరికను వ్యతిరేకించినట్లు తెలిసింది. బల్దియా చైర్‌పర్సన్ అవినీతి, అక్రమాలపై ఫిర్యాదు చేసిన మనమే వారిని చేర్చుకుంటే సబబు కాదని ఇరుపార్టీల నాయకులు నాయకత్వానికి చెప్పినట్లు తెలిసింది. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది.

నిజామాబాద్ నగరంలోని ఓ పెట్రోల్ బంక్ వద్ద బారులు తీరిన వాహనదారులు

పెట్రోల్ బంకులకు పోటెత్తిన జనం

గంటల కొద్దీ క్యూలో నిల్చున్న వైనం

డబ్బాలు, బాటిళ్లతో తరలివచ్చిన ప్రజలు

చాలాచోట్ల ఖాళీ అయిన ఇంధన నిల్వలు

బంకుల్లో వెలిసిన 'నో స్టాక్' బోర్డులు

బంకుల్లో బారులు

ట్రక్కు డ్రైవర్ల సమ్మె ఎఫెక్ట్

కేంద్రం తీసుకొచ్చిన భారత న్యాయ సంహిత చట్టంలో 'హిట్ అండ్ రన్' కేసుల్లో నిబంధనలను కఠినతరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ లారీ, ట్రక్కు డ్రైవర్లు మంగళవారం సమ్మె నిర్వహించారు. దీంతో పెట్రోల్, డీజిల్ ట్యాంకర్లు సైతం ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ వార్త దావానంలా వ్యాపించడంతో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడనుందనే భయంతో వాహనదారులు బంకుల వైపు పరుగులు పెట్టారు.

– బాన్సువాడ/ చందూర్/ నస్రుల్లాబాద్, జనవరి 2

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో రద్దీ ఏర్పడింది. ద్విచక్ర వాహనాలతోపాటు కార్లు, మినీ గూడ్స్, ఇతర వాహనాలు కిక్కిరిసిపోయాయి. కొందరు వాహనదారులు ట్యాంక్ ఫుల్ చేయించుకోవడంతోపాటు బాటిళ్లలో సైతం తీసుకెళ్లారు. పలు పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి.

ఆందోళనలో రైతులు.. ట్రాక్టర్ డ్రైవర్ల పరుగులు

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం యాసంగి వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. దీంతో పొలం దమ్ము చేసేందుకు ట్రాక్టర్లకు డీజిల్ అవసరం ఉంటుంది. రోజుకు ఒక్కో ట్రాక్టర్‌కు సుమారు 50 లీటర్ల డీజిల్ అవసరం కాగా రాబోయే ఐదు రోజుల పాటు డ్రైవర్ల సమ్మె దృష్ట్యా డీజిల్ అందుబాటులో ఉండదనే ఉద్దేశంతో రైతులు ఆందోళన చెందారు. సరిగ్గా అదను సమయంలోనే ఇంధన కొరత మూలంగా నాట్లు వేసేందుకు ఇబ్బంది ఏర్పడుతుందని ఒకవైపు రైతులు, మరోవైపు ట్రాక్టర్ డ్రైవర్లలో టెన్షన్ నెలకొన్నది. దీంతో డీజిల్ డబ్బాలతో బంకులకు పరుగులు పెట్టారు.

నస్రుల్లాబాద్‌లో డీజిల్ డబ్బాలతో వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు

చందూర్‌లో పెట్రోల్ కోసం బాటిళ్లతో క్యూలో నిలబడ్డ జనం

కేంద్రం తీరును నిరసిస్తూ సమ్మె..

కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ట్రక్కు డ్రైవర్లు ఆందోళన బాట పట్టారు. కేంద్రం ఇటీవల న్యాయ శిక్షాస్మృతుల్లో భారీగా మార్పులు చేస్తూ మూడు చట్టాలను తీసుకొచ్చింది. ఇందులో భాగంగా భారతీయ న్యాయ సంహిత చట్టంలో 'హిట్ అండ్ రన్' కేసులకు సంబంధించి తీసుకొచ్చిన కఠిన నిబంధనపై ట్రక్కు డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ)ప్రకారం నిర్లక్ష్యంగా వాహనం నడిపి, ఎవరైనా చనిపోవడానికి కారణమైతే గరిష్టంగా రెండేళ్ల వరకూ జైలు శిక్ష ఉండేది. అయితే, కేంద్రం తాజాగా తీసుకొచ్చిన చట్టం ప్రకారం.. హిట్ అండ్ రన్, ర్యాష్ డ్రైవింగ్ కేసుల్లో గరిష్టంగా పదేళ్ల జైలు, రూ.7 లక్షల వరకూ జరిమానా విధించే అవకాశముంది. ఈ నిబంధనను నిరసిస్తూ ట్రక్కు డ్రైవర్లు దేశవ్యాప్తంగా ఆందోళన బాట పట్టారు. ఫలితంగా పెట్రో ఉత్పత్తులు తరలించే ట్రక్కులు ఎక్కడికక్కడ నిలిచి పోయాయి. స్టాక్ రాకపోవడం, బంకుల్లో నిల్వ ఉన్న ఇంధనం అయిపోవడంతో పెట్రోల్, డీజిల్‌కు కొరత ఏర్పడింది.

సమ్మె భయంతోనే వచ్చాను..

రుద్రూర్, జనవరి 2: లారీలు, ట్రక్కు డ్రైవర్ల సమ్మెతో పెట్రోల్ కూడా దొరకదని తెలిసింది. దీంతో వెంటనే బైక్ తీసుకొని బంకుకు వచ్చాను. నా మాదిరే చాలా మంది వాహనాల్లో పెట్రోల్ పోయించుకునేందుకు లైన్లలో నిల్చున్నారు. మా దగ్గర ఉన్న బంకుల్లో ఎక్కడ చూసినా బైకులు, కార్లే కనిపిస్తున్నాయి.

- పవన్, రుద్రూర్

సమ్మెతో ఇబ్బందే..

రుద్రూర్, జనవరి 2: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలకు వ్యతిరేకంగా లారీ డ్రైవర్లు సమ్మె చేస్తున్నారని తెలిసింది. పెట్రోల్, డీజిల్, కూరగాయలు, ఇతరత్రా వాటిని తీసుకొచ్చే లారీల డ్రైవర్లు సమ్మె చేస్తే మేమంతా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. ప్రజలు ఇబ్బందులకు గురికాకముందే కేంద్రం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

- రహీమ్, రుద్రూర్

రెండు గంటలు నిల్చున్న..

డోంగ్లి, జనవరి 2: నాకు వ్యవసాయ పనుల కోసం పెట్రోల్ అవసరం. ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు స్టైక్ చేస్తుం డ్రు.. పెట్రోల్ దొరకదని ఊర్లో పబ్లిక్ చెప్పిండ్రు. వెంటనే బంకుకు వచ్చిన. ఇక్కడ చూస్తే మస్తు మంది లైన్ల నిల్చున్నరు. రెండు గంటలు లైన్లలో నిల్చుంటే నా వంతు వచ్చింది.

- సంజయ్, డోంగ్లీ

'ప్రజాపాలన' తీరు జనం బేజారు..

అభాసుపాలు

తూతూ మంత్రంగా కార్యక్రమ నిర్వహణ

సమయపాలన పాటించని అధికారులు

పలుగ్రామాల్లో నిరీక్షిస్తున్న ప్రజలు

నర్వ గ్రామంలో ఉదయం 9:15 గంటలకు టెంట్లు వేస్తున్న సిబ్బంది

నిజాంసాగర్, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమ తీరుపై ప్రజల నుంచి అసహనం వ్యక్తమవుతున్నది. ప్రభుత్వం అభయహస్తంలో భాగంగా ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి దరఖాస్తులను స్వీకరిస్తున్నది. జనాభా ఆధారంగా ఆయా గ్రామాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసింది. కౌంటర్ల ద్వారా ప్రజలకు దరఖాస్తు ఫారాలను అందజేసి..మళ్లీ స్వీకరించాల్సి ఉంటుంది. ఇంత వరకు బాగానే ఉన్నా మండలంలో ప్రతిరోజూ మూడు గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో గ్రామంలో ఆరు కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తు ఫారాలను స్వీకరిస్తున్నారు. మంగళవారం నిజాంసాగర్ మండలంలోని మాగి, వెల్గనూర్, మహ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామంలోప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉదయం 8 నుంచి సాయంత్రం 6గంటల వరకు కార్యక్రమం కొనసాగనుండగా.. మధ్యాహ్నం భోజనం కోసం విరామ సమయం కేటాయించారు. ఉదయం 8 గంటలకే అధికారులు హాజరుకావాల్సి ఉండగా మాగి గ్రామంలో 9 గంటలు గడిచినప్పటికీ ఏ ఒక్క అధికారి హాజరుకాకపోవడం గమనార్హం. తహసీల్దార్ భిక్షపతి ఒక్కరే హాజరైనప్పటికీ మిగతా అధికారుల కోసం ఆయన సైతం ఎదురు చూడాల్సి వచ్చింది. వెల్గనూర్ గ్రామంలో సైతం ఇదే తంతు కొనసాగగా.. నర్వ గ్రామంలో ఉదయం 9:15 గంటలకు కార్యక్రమం కోసం టెంటు వేసే పనులును చేపట్టారు. దీంతో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వారు అక్కడే అధికారుల కోసం ఎదురుచూస్తూ బైఠాయించారు. ఇక నర్వ గ్రామంలో కార్యక్రమానికి వచ్చిన వారికి దరఖాస్తు ఫారాలు అందకపోవడతో అక్కడే నిరీక్షించారు. దరఖాస్తు ఫారాలు అయిపోయాయని మరో గంటలో వస్తాయని తెలుపడంతో అక్కడే నిరీక్షించారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు మమ అనిపిస్తూ కొనసాగిస్తున్నారని.. ఏ అధికారి కూడా సమయపాలన పాటించడం లేదని ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో నాగేశ్వర్‌ను సంప్రదించగా.. చలి ప్రభావంతో కొంత ఆలస్యంగా కార్యక్రమం కొనసాగిస్తున్నామని..ఇక నుంచి అధికారులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన

కమ్మర్‌పల్లి గ్రామసభలో బీఆర్ఎస్ నాయకుల నిలదీత

ఉన్నతాధికారుల సూచనలతో స్పందించిన స్థానిక అధికారులు

ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు

ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఫొటోతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన అధికారులు

కమ్మర్‌పల్లి, జనవరి 2: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ప్రొటోకాల్ ఉల్లంఘన చోటుచేసుకోగా.. బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. దీంతో అధికారులు వెంటనే ఎమ్మెల్యే ఫ్లెక్సీ ఏర్పాటు చేయించి సభను కొనసాగించారు. కమ్మర్‌పల్లిలో ప్రజాపాలన గ్రామసభ వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఫొటో లేకపోవడంతో ఎంపీటీసీ మైలారం సుధాకర్, బీఆర్ఎస్ నాయకుడు లోలపు సుమన్, గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజలచే ఎన్నుకోబడిన ఎమ్మెల్యే ఫొటో లేకపోవడంపై అధికారులను నిలదీశారు. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ ఫొటోలు ఏర్పాటు చేయాలని, వారి ఫొటోలు ఏర్పాటు చేసిన తర్వాతే సభ నిర్వహించాలని పట్టుబట్టారు. దీంతో స్థానిక అధికారులు జిల్లా అధికారులకు సమాచారం అందించి, సభలో వ్యక్తమైన అభ్యంతరాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్సీతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. గ్రామసభ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

'ప్రజాపాలన'లో నిర్లక్ష్యం..

రెంజల్ ఎంపీడీవో, గ్రామ కార్యదర్శికి మెమోలు జారీ

రెంజల్, జనవరి 2: రెంజల్ ఎంపీడీవో శంకర్, సాటాపూర్ గ్రామ కార్యదర్శి మహిబూబ్ అలీకి అధికారులు మెమో జారీ చేశారు. ఈ మేరకు జడ్పీ సీఈవో గోవింద్‌నాయక్, డీపీవో జయసుధ వేర్వేరుగా ఉత్వర్వులు జారీ చేశారు. సాటాపూర్ గ్రామంలో డిసెంబర్ 30న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన అభయహస్తం గ్రామసభలో ఆరు గ్యారెంటీలపై ప్రజలకు అవగాహన కల్పించకపోవడం, దరఖాస్తు ఫారాలను అందించడంలో జాప్యం జరిగింది. ఇందుకు వారిని బాధ్యులను చేస్తూ అధికారులు మెమోలు జారీచేశారు.

బ్యాంకులో చోరీకి విఫలయత్నం

బిహార్ ముఠా అంటూ పోలీసులను హడలెత్తించిన దుండగుడు

గ్రామస్తుల సహకారంతో నిందితుడిని పట్టుకున్న పోలీసులు

ధర్పల్లి, జనవరి 2: బ్యాంకు చోరీకి విఫలయత్నం చేసిన నిందితుడు, బిహార్ ముఠా సభ్యులమంటూ చెప్పి పోలీసు యంత్రాంగాన్ని హడలెత్తించి పరుగులు పెట్టించిన ఘటన నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలో చోటు చేసుకున్నది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. దుబ్బాక గ్రామంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో సోమవారం అర్ధరాత్రి 11 గంటలకు రెంజల్ మండలం దూపల్లికి చెందిన ఆలూర్ సంతోష్‌రెడ్డి అనే దుండగుడు చోరీకి యత్నించాడు. బ్యాంకు షట్టర్ తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లడంతో సైరన్ మోగింది. ఆ సమాచారం మేనేజర్, డిప్యూటీ మేనేజర్‌కు వెళ్లడంతో హుటాహుటిన బ్యాంకు వద్దకు చేరుకున్నారు. షట్టర్ కొద్దివరకు లేచి ఉండడంతో దొంగలు పడ్డట్లుగా భావించి గ్రామస్తులకు సమాచారమిచ్చారు. గ్రామస్తులంతా కలిసి షట్టర్‌ను మూసివేశారు. సమాచారం అందుకున్న ఎస్సై వంశీకృష్ణారెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు.

బిహారీ ముఠా అంటూ హల్‌చల్.. షట్టర్ బయటి నుంచే నిందితుడితో ఎస్సై మాట్లాడే ప్రయత్నం చేయగా తనతోపాటు బిహార్‌కు చెందిన ఏడుగురు ఉన్నట్లు తెలపడంతో పోలీసులు హడలెత్తిపోయారు. తమ వద్ద ఉన్న సిబ్బందితో దుండగులను పట్టుకోలేమని భావించి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో సిరికొండ, ఇందల్వాయి పోలీస్ స్టేషన్ల నుంచి మరికొంత మంది సిబ్బంది వచ్చారు. వారందరి సహకారంతో బ్యాంకు షట్టర్ తీయగా లోపల ఒక్కడే ఉన్నాడు. దీంతో నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఏసీపీ కిరణ్‌కుమార్ మంగళవారం ఉదయం బ్యాంకును పరిశీలించారు. క్లూస్‌టీమ్ వచ్చి వివరాలు సేకరించింది. నిందితుడికి మేనత్త వరుస అయిన లక్ష్మి దుబ్బాకలో ఉంటుందని, గతంలో ఇక్కడ డ్రైవర్‌గా పనిచేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు